

(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

-188-

(3 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

మొన్న జరిగిన ఒక వివాహంలో పెళ్ళి కుమార్తెలకు ఒకరు కొన్ని సలహాలు అచ్చు వేయించి ఇచ్చారు. 'పెద్దల సందేశం' అన్న పేరుతో. మొత్తానికి చాలా చక్కటి సలహాలే ఇచ్చారు. అవి ఇరవై దాకా వున్నాయి.

కాని వ్రాసి ఇవ్వడంలో వున్న సొగసూ, సౌలభ్యం, ఆచరించడంలో ఎక్కడ వుంటుంది? పైగా ఆ సందేశాలలో పైన పేర్కొన్నారు – "పూర్వకాలపు పద్ధతిలో వ్రతాలు, నోములు, ఉద్యాపనలు, ధర్మాలు, త్యాగాలు – వగైరాలు మేము సూచించడం లేదు. కేవలం పతి సేవలో నిమగ్నురాలవు కమ్మనీ, పతి హృదయంలో గూడు కట్టుకుని కోయలగానం చెయ్యమని మాత్రమే పేర్కొన్నాం ఇది ఆధునిక సందేశం. అమృతసందేశం" అని.

"ఇల్లు ఎప్పుడూ అతి శుభ్రంగా వుంచు. అందంగా అలంకరించు, పూలకుండీలు వగైరాలు పెట్టి నందనవనంగా ఏర్పటు చెయ్యి. ప్రతి ఇంట్లో అడుగుపెట్టగానే పకపకలాడాలి. పరమానందం పొందాలి. ఇల్లు నందనవనం. నీ మనస్సు వసంతసీమగా మారాలి" ఇది పైన పేర్కొన్న సూచనలలో ఒకటి.

ఆ దంపతులు సామాన్య కుటుంబంలో వాళ్ళు. పెళ్ళికుమారుడింకా ఉద్యోగాన్వేషణలో వున్నాడు. ఉద్యోగం దొరక్కపోతుందా! వృద్ధిలోకి రాకపోతాడా? అన్న విశ్వాసంతో పిల్లనిచ్చి పెళ్ళిచేస్తున్నారు కన్న తల్లితండ్రులు.

"ఏదో ఒక అద్దెకొంప తీసుకుని, ఆలూ మగలూ అన్నోదకాలకు లోటులేకుండా బ్రతికితే అంతే చాలు. ఐశ్వర్యాలమాట ఆ దైవానికే తెలుసు. "ఒక్క మాటుగా ఎవరూ చక్రవర్తులు కాలేరుగదా" అని ఆ పిల్ల తండ్రి చెప్పుకుని సరిపెట్టుకున్నాడు.

అలాటి పరిస్థితిలో వాళ్ళుంటే ఇల్లు నందనవనం అంటే మనస్సు వసంత వనం అంటే ఎలా? నిజానికి సామాన్య ఉద్యోగస్థుల సంసారాలు చూస్తూంటే వారి బాధలు తెలుస్తాయి. ఇంట్లో ఒకటి వుంటే ఒకటి వుండదు.

మొన్న అయిదరు వందలు జీతం సంపాదించే ఒక పెద్దమనిషి ఇంటికి వెళ్ళాం నేనూ మరో మిత్రుడు కలిసి. ఆయనగారు ఒక కుర్చీ తెచ్చి వేశాడు. రెండో కుర్చీలేదు. అందువల్ల ట్రంకు పెట్టి క్రిందపెట్టి దాని క్రిందవున్న బల్ల తెచ్చి వేశారు. నేనూ మిత్రుడూ కుర్చీలో మీరంటే మీరు అని తగవులాడుకున్నాం.

చివరకు మా మిత్రుడు బల్లమీద కూర్చున్నాడు. ఆయన మాట్లడూతున్నంతసేపు ఆ బల్ల కదులుతూనే వుంది. ట్రంకు పెట్టి క్రింద బల్ల కదా అది. మరి ట్రంకు పెట్టెకు వున్న కుదురు నా మిత్రుడికి ఎక్కడిది? ఎలాగో అలా సంభాషణ ముగించి బయలుదేరబోతున్నాం.

కాఫీ తెస్తానని లోపలికి వెళ్ళాడు. కాఫీ పని భార్యకు పురమాయించి పసిపిల్లను తాను ఎత్తుకుని వచ్చాడు పాపం ఆయనగారికి కూర్చునేందుకు కుర్చీలేదు బల్లా లేదు. అందువల్ల పచార్లు చేస్తున్నాడు. ఇక ఆ పిల్ల అవతారం చూడాలి.

కొంచెం దగ్గరనుంచి చూడటంవల్ల వాళ్ళ పిల్ల అని తెలిసిందిగాని కొంచెం లాంగ్ షాట్‌లో చూస్తే ముంగిస అనుకునేవాళ్ళం. ఒళ్ళంతా మట్టి, జుట్టంతా మట్టి. చొక్కాలేదు. పాపం తీరుబడి లేక ఆ ఇల్లాలు అలా వదిలివేసింది బిడ్డను. ఇంట్లోపని అంతా చూసుకుని మధ్యాహ్నం ఏ ఒంటిగంటకో పిల్ల ఒళ్ళు తుడవడం కార్యక్రమంలోకి దిగుతుందన్నమాట.

నిజానికి పిల్లల్నే సరిగా చూసుకోవడానికి, కొంచెం అలంకరించి వుంచడానికి, వీలు లేని సంసారాల్లో ఇల్లు నందనవనం చెయ్యమంటే ఎలా సాధ్యమవుతుంది? పూర్వ షేక్సిపియర్ థియేటర్‌లో ఆ యా రంగాల పేర్లు అట్టల మీద వ్రాసి వుంచినట్లు – 'నందనవనం ' అనే అట్ట ఒకటి పెట్టుకోవాలి లేదా ఆ ఇంటికే నందనవనమనే పేరు పెట్టాలి.

అందులో ఒకరిద్దరు పిల్లలు పుట్టిన తర్వాత ఆ ఇంటి లక్షణం చెప్పాలి ఎంత జాగ్రత్త వున్నా, వారు చేసే రభస వాళ్ళు చేస్తూనే వుంటారు. చించిపోసిన కాగితాలు, బిళ్ళ పెంకులు, డబ్బా మూతలు, వగైరా లెన్నో ఇంటినిండా విరజిమ్మబడి వుంటాయి.

టేబుల్ క్లాత్‌లు గదిమూల పడి వుంటాయి. కుర్చీలో మెత్తలు వీధి గుమ్మం దగ్గర వుంటాయి. ఫ్లవర్ వేజ్ పల్టీలు కొడుతూ వుంటుంది. తల్లి పడ్డ శ్రమ వాళ్ళకేం తెలుస్తుంది. చక్కగా సర్దుకుంటే తల్లికి ఆనందం చిమ్మితే వాళ్ళకు సంతోషం. ఇల్లు నందనవనంగా వుండాలంటే ఎలా సాధ్యం?

కొందరు తల్లులు వీరికి బోధిస్తూ వుంటారు. ఇల్లు నీట్‌గా వుండాలి ఎక్కడి వస్తువులు అక్కడే వుండాలని. కాని పాపం వాళ్ళకేం అర్థమవుతుంది? ఒక యింట్లో పిల్లాడు గ్లాసు, బ్రద్దలు కొట్టాడట. అది ఎవరికీ చెప్పకుండా పారిపోయాడట.

తక్కినవాళ్ళు చూసి 'గాజు ముక్కలు పడ్డాయి తీద్దాం అంటే అమ్మ ఎక్కడవి అక్కడే వుంచమంటుందాయె ఎలా?' అనుకుని చక్కా పోయారట. వాళ్ళ అమాయకత్వం అలా వుంటుంది.

అసలు కొందరి ఇళ్ళల్లో అడుగుపెట్టడానిక్కూడా అవకాశం వుండదు. ఇంట్లో వున్న పాత బట్టలన్నీ ఒకచోట పడి వుంటాయి. నడుస్తూ నడుస్తూ వాటిని తన్నుతూ వుంటారు.

వాటిలో ఏ వస్తువు పడితే ఆ వస్తువు గిరాటు వేస్తూ వుంటారు. దువ్వెన కనపడకపోయి, మళ్ళీ వాటినన్నిటినీ కుప్పనూర్పిడిలో గడ్డి తిరగవేసినట్లు తిరగవెయ్యవలసిందే.

ఉన్న రెండు కుర్చీలలో ఏవేవో వస్తువులు పెట్టి వుంటాయి. ఒకరింటికి వెళ్ళి చూస్తే పిండి జల్లెడ, అప్పడాల కర్ర, వగైరాలు పెట్టి వున్నాయి. అలాంటి సందర్భాలలో నేరాలన్నీ పిల్లల మీదికి తోస్తూ వుంటారు పెద్దలు.

"అబ్బే! అవి మేము పెట్టందే. మాకేం తెలుసు వాటి సంగతి?" అని పిల్లలు గోలపెడితే "పోనీలెండి ఎవరో ఒకరు పెట్టారులెండి, మీరు వెళ్ళి ఆడుకోండి" అని వాళ్ళ మాటలు తప్పించి వేస్తారు పెద్దలు.

కొందరు ఇళ్ళల్లో బూజే దులుపుకోరు. సామాన్లమీద దుమ్ము అంతకన్నా దులపరు. విరిగిపోయిన వస్తువులుంటే అవతల పారెయ్యరు. దాస్తే ఎప్పటికైనా మంచి ధర వస్తుందనే భ్రమేమో.

ఇళ్ళు నందనవనంగా వుండాలని దీవిస్తే సరా! అది ఒక గొప్ప కళ. ఆ దృష్టి కలవాళ్ళు కొంతవరకైనా ఆ అందాన్ని సాధించకలుగుతారు. తక్కిన వాళ్ళ కాళ్ళకు బంధాలు పడినట్లు, అలా పడుతూ లేస్తూనే వుంటారు బ్రతుకంతా.

Post your comments